## క్లుప్తంగా

### నిత్యావసరాల అందజేత

ఆలమూరు: మండలంలోని బడుగువానిలంకలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కారుపోతు దుర్గయ్య (19) కుటుంబానికి నిత్యావసరాల పంపిణీ జరిగింది. గ్రామానికి చెందిన ఏఎంసీ డైరెక్టర్ కటారి గంగరాజు మృతుని కుటుంబం ఆర్థిక పరిస్థితి తెలుసుకుని సుమారు రూ.పది వేలు విలువైన నిత్యావసరాలను అందజేశారు. ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి సాయంతో మృతుడు దుర్గయ్య కుటుంబానికి ప్రభుత్వం నుంచే వచ్చే సాయాన్ని త్వరితగతిన మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అత్తిలి శ్రీనివాసు, జవ్వా దుర్గయ్య, మారిశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### ప్రమాద స్థితిలో ఒరిగిన భారీ వృక్షం



కె.పెదపూడిలో ప్రమాద స్థితిలో ఒరిగి ఉన్న భారీ వృక్షం

అంబాజీపేట: కె.పెదపూడిలో ప్రధాన రహదారి పక్కనే భారీ వృక్షం నేలకొరిగేందుకు ప్రమాద స్థితిలో ఉంది. ఏ క్షణంలోనైనా కూలిపోతుందని ప్రయాణికులు, బాటసారులు, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిలో భారీ వృక్షం నేలకొరిగితే పెను ప్రమాదం సంభవించే అవకాశం ఉందని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏ ప్రమాదం జరగక ముందే భారీ వృక్షాన్ని తక్షణమే తొలగించేందుకు ఆర్అండ్‌బీ, పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.

### అగ్నిప్రమాద బాధితునికి రెడ్ క్రాస్ సాయం



బాధిత కుటుంబానికి సాయం అందిస్తున్న జంపన బుజ్జిరాజు

మలికిపురం: మండలంలోని విశ్వేశ్వరాయపురంలో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన నేదునూరి పెద్దింట్లు కుటుంబానికి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అండగా నిలిచింది. ప్రెసిడెంట్, జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా ఆదేశాల మేరకు రెడ్ క్రాస్ చైర్మన్ కోరుకొండ సత్యనారాయణ సూచనలతో రాజోలు, గన్నవరం నియోజకవర్గాల రెడ్ క్రాస్ కార్యక్రమాల సమన్వయకర్త జంపన బుజ్జిరాజు చేతుల మీదుగా టార్పాలిన్, వంట సామగ్రి, హైజెనిక్ కిట్స్, బియ్యం, కూరగాయలు, నిత్యావసరాలు అందించారు. బుధవారం జరిగిన కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖ సహాయ కార్యదర్శి బోనం రాజు, తాడి సహదేవ్, నల్లి శివకుమార్, జిల్లా కోఆర్డినేటర్ రత్న ప్రసాద్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

### వంతెనకు రెయిలింగ్ నిర్మించాలి



వంతెనకు ఇరువైపులా రెయిలింగ్ లేకపోవడంతో ప్రమాదకరంగా ఉన్న దృశ్యం

అయినవిల్లి: కొండుకుదురులో బొబ్బర్లంక–పల్లంకుర్రు పంటకాలువపై ఏర్పాటు చేసిన వంతెన రెయిలింగ్ కూలి ప్రమాదకరంగా మారింది. దీంతో రైతులు, వాహన చోదకులు ప్రయాణించడానికి ఇబ్బందులు పడుతున్నారు. పలు ప్రమాదాలు కూడా ఇక్కడ జరిగాయి. ఈ వంతెన నిర్మించి సుమారు ఇరువై సంవత్సరాలు కావస్తుంది. ఈ వంతెన ఇరువైపులా రెయిలింగ్ ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా కాపాడాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.

### సమాచారం ఇవ్వడంలో నిర్లక్ష్యం వద్దు

అల్లవరం: సమాచార హక్కు చట్టం ద్వారా ఎవరైనా సమాచారాన్ని కోరితే 30 రోజుల వ్యవధిలో ఫిర్యాదుదారుడు కోరిన సమాచారాన్ని ఇవ్వాలని ఎంపీడీఓ కృష్ణమోహన్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టంపై బుధవారం అవగాహన కల్పించారు. తూర్పులంక గ్రామానికి చెందిన ఐవీవీ సత్యనారాయణ సమాచార హక్కు చట్టం ద్వారా సమాచారాన్ని కోరితే ఐదు నెలలు కావస్తున్నా సమాచారం ఇవ్వకపోవడంతో అప్పీల్ అథారిటీకి ఫిర్యాదు చేశారు. దీనిపై ఎంపీడీఓ విచారణ చేపట్టారు. జూన్ 11 లోగా ఫిర్యాదుదారుడు అడిగిన సమాచారం ఇవ్వాలని తూర్పులంక కార్యదర్శి కేవీవీ సత్యనారాయణను ఆదేశించారు. ఫిర్యాదుదారుడుకి సమాచారం ఇవ్వకుండా నిర్లక్ష్యం చేసిన కార్యదర్శిని మందలించారు. మరోసారి పునరావృతం కాకూడదని హెచ్చరించారు.

# గ్రామాల్లో జల్లెడ పడుతున్న పోలీసులు

- ముమ్మరంగా కార్డన్ అండ్ సెర్చ్
- పత్రాలు లేని వాహనాల స్వాధీనం



మాచవరం మెట్ల కాలనీలో కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహిస్తున్న ఎస్సై చిరంజీవి



రామరాజులంక గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ గోవిందరాజు, ఎస్సై సంపత్ కుమార్

అంబాజీపేట: గ్రామాల్లో పోలీసుల హడావుడి ప్రజలకు దడ పుట్టిస్తుంది. ఎన్నడూ లేని విధంగా కార్డన్ అండ్ సెర్చ్ పేరుతో పోలీసులు గ్రామాల్లో జల్లెడ పడుతున్నారు. దీంతో ప్రజలు హడలిపోతున్నారు. పోలీసులు ఇంటి ముందు ప్రత్యక్షమవుతుండడంతో ఏమి జరిగిందోనంటూ బేజారెత్తిపోతున్నారు. కొత్త ఒరవడికి పోలీసులు శ్రీకారం చుట్టడంతో ఉదయం గ్రామాలు బోర్డర్లను తలపిస్తున్నాయి. ఎన్నికలు పూర్తి కావడంతో రాయలసీమ వంటి ప్రాంతాల్లో అల్లర్లు జరగడం, ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో శాంతి భద్రతలను కాపాడడం కోసం ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ ప్రారంభించారు. దీని ప్రకారం ఆయా పోలీస్‌స్టేషన్ పరిధిలో అకస్మాత్తుగా ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకొని, ఎటువంటి సమాచారం బయటకు పొక్క కుండా ముందు జాగ్రత్తలు తీసుకొని ఒక్కసారిగా తెల్లవారుజాము నుంచే ప్రతి ఇంటిని జల్లెడ పడుతున్నారు. ఎవరైనా కొత్తవారు ఆ ప్రాంతానికి వచ్చారా? వస్తే ఎందుకు వచ్చారు ? వారు ఏ వాహనాల్లో వచ్చారు వంటి అంశాలను పరిశీలిస్తున్నారు. దీంతో పాటు వారి వద్ద అక్రమంగా మందు గుండు సామగ్రి ఉన్నా, సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకుంటున్నారు. అంబాజీపేట మండలం మాచవరం మెట్లకాలనీ, తదితర గ్రామాల్లో కార్డన్ అండ్ సెర్చ్ ప్రారంభించారు. దీంతో ప్రజలంతా ఉలిక్కిపడ్డారు. ప్రతి వీధిలోనూ పోలీసుల పహారా నిర్వహించి, అనుమానాస్పదంగా ఉన్న ఇళ్లను తనిఖీ చేశారు. దీంతో పలు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటి వరకు పి.గన్నవరం. రాజోలు, కొత్తపేట నియోజకవర్గాల్లోని ఒక్కో గ్రామంలో ఈ కార్డన్ సెర్చ్ నిర్వహించారు. స్వాధీనం చేసుకున్న వాహనాలకు ధ్రువీకరణ పత్రాలు చూపిస్తే వాటిని తిరిగి అప్పగిస్తున్నారు. పాత నేరస్తులపై మరింత నిఘా పెంచారు.

**రామరాజులంకలో..**

మలికిపురం: మండలంలోని రామరాజులంకలో రాజోలు సీఐ గోవిందరాజు, మలికిపురం ఎస్సై వి.సంపత్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందితో బుధవారం కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. సీఐ, ఎస్సైలు మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీ ఆధ్వర్యంలో గ్రామంలో కార్డెన్ సర్చ్ నిర్వహించడం జరిగిందన్నారు. గ్రామంలోని అనుమానిత ఇళ్లలో సోదాలు నిర్వహించామన్నారు. శాంతిభద్రతల దృష్ట్యా సమస్యాత్మక గ్రామాల్లో ఈ సోదాలు నిర్వహించడం జరుగుతుందని. ఎన్నికల లెక్కింపును దష్టిలో ఉంచుకొని గ్రామాల్లో ఎలాంటి అల్లర్లు, అసాంఘిక కార్యక్రమాలకు చోటివ్వకుండా ముందస్తుగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కట్టుదిట్టమైన భద్రత చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి అల్లర్లకు, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే సహించేది లేదని, ఎంతటివారైనా సరే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. మీ గ్రామంలో ఎవరైనా కొత్తవారు అనుమానాస్పదంగా తిరుగుతూ ఉంటే వెంటనే పోలీస్ లేదా డయల్ 100కు ఫోన్ చేసిన వెంటనే చర్యలు చేపడతామన్నారు. జిల్లాలో 144 సెక్షన్ అమలులో ఉన్నందున కౌంటింగ్ రోజున కౌంటింగ్ ఏజెంట్, క్యాండిడేట్ అనుమతి ఇచ్చిన వారు తప్ప ఎవరూ కూడా కౌంటింగ్ కేంద్రం వద్దకు వెళ్లరాదు. విజయోత్సవ ర్యాలీలకి అనుమతి లేదు. అలా కాకుండా ఎవరైనా నిబంధనలకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తే చట్టపరమైన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు.

**ఆదేశాల మేరకు సోదాలు**



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామాల్లో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నాం. అసాంఘిక కార్యక్రమాలకు చెక్ చెప్పడమే దీని ముఖ్య ఉద్దేశ్యం. శాంతి భద్రతలను కాపాడేందుకు అన్ని గ్రామాల్లోనూ ఆకస్మికంగా కార్డన్ సెర్చ్ నిర్వహిస్తాం.

– డి.ప్రశాంత్‌కుమార్, సీఐ, పి.గన్నవరం

### గురుకులంలో ఈనెల 25న స్పాట్ అడ్మిషన్స్

పి.గన్నవరం: మండలంలోని నరేంద్రపురం గురుకుల కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి సీఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో మిగిలిన సీట్లకు ఈనెల 25 కాకినాడ సాంబమూర్తి నగర్ బాలికల గురుకుల కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ పి.వేణు తెలిపారు. పదో తరగతి మార్కులను ఆధారంగా తీసుకుని సీట్లు కేటాయిస్తారని ఆయన వివరించారు. సీఈసీ గ్రూపులో ఎస్సీలకు 14, ఎస్టీ–1, బీసీ సీ–5, ఎంఈసీలో ఎస్సీ–23, ఎస్టీ–2, బీసీ సీ–5, బీసీ–2 సీట్లు ఖాళీగా ఉన్నాయని ఆయన వివరించారు.

### వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

అంబాజీపేట: మరింత మంది విద్యార్థులు వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకొని జనరల్ నాలెడ్జ్ పెంపొందించుకోవాలని గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ జి.శ్రీనివాస్ అన్నారు. అంబాజీపేట శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా విద్యార్థులకు కథలు, పుస్తక సమీక్ష తదితర అంశాలపై బుధవారం అవగాహన కల్పించారు. విద్యార్థులకు వినే నైపుణ్యాలు (కథలు), పుస్తక సమీక్ష, స్పోకెన్ ఇంగ్లీష్, డ్యాన్స్, పెయింటింగ్, ఆటలు, ఆధ్యాత్మిక విషయాలు, వివిధ సబ్జెక్ట్స్, నీతి కథలను వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ రీడర్లు, విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

## రాజోలులో వైఎస్సార్ సీపీ జెండా ఎగరడం ఖాయం



తాటిపాకలోని గొల్లపల్లి నివాసంలో చర్చించుకుంటున్న రాపాక, గొల్లపల్లి

రాజోలు: నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగరడం ఖాయమని అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావు, రాజోలు అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావులు ధీమా వ్యక్తం చేశారు. బుధవారం తాటిపాకలోని గొల్లపల్లి సూర్యారావు నివాస గృహానికి రాపాక వెళ్లి మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఎన్నికల అనంతరం నియోజకవర్గంలోని రాజకీయ పరిస్థితులపై చర్చించారు. ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల కృషిని అభినందించారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా మళ్లీ సీఎంగా జగన్ మోహన్ రెడ్డి ప్రమాణస్వీకారం చేస్తారన్నారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి పథకాలతో పాటు సీఎం జగన్ అమలు చేసిన సామాజిక న్యాయంతో విజయం వైపు అడుగులు వేస్తామని రాపాక, గొల్లపల్లి ధీమా వ్యక్తం చేశారు.

## 26న ఏలూరులో పద్య కవుల సమ్మేళనం

సఖినేటిపల్లి: ఈ నెల 26న ఏలూరులో శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో పద్య కవులకు పట్టాభిషేకం పేరుతో అంతర్జాతీయ శతాధిక పద్య కవుల సమ్మేళనం నిర్వహిస్తున్నట్టు కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ బుధవారం తెలిపారు. సఖినేటిపల్లిలో మీడియాతో ఆయన మాట్లాడుతూ, ఈ సమ్మేళనంలో సీస పద్య వైభవం పుస్తకావిష్కరణ చేయనున్నట్టు తెలిపారు. తెలుగు భాషకు పద్యం ప్రాణమని, 175 మంది సీస పద్య కవులతో శ్రీనాథుని సీస పద్య వైభవం పేరిట పై సంకలనం పుస్తకాన్ని ఇప్పటికే రూపొందించామన్నారు. వేర్వేరు ప్రాంతాలలో అంతర్జాతీయ స్థాయిలో ఉన్న తెలుగు పద్య కవులందరినీ ఒక చోటకు చేర్చడమే ఈ వేదిక లక్ష్యమని, దీని ద్వారా వారందరినీ ఘనంగా సత్కరించే విధంగా ఏర్పాట్లు చేశామన్నారు. కాగా ఇంత వరకూ శతాధిక పద్య కవులతో ఎక్కడా కూడా సమ్మేళనం జరగలేదని, ఇదో ప్రపంచ రికార్డు కాబోతోందన్నారు. ఇందుకు గాను కవుల నమోదు ప్రక్రియ, సమ్మేళనం నిర్వహణ ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆయన వెల్లడించారు.

## వంతెనకు సమీపంలో ఆటో బోల్తా



అప్పనరామునిలంక వైపు వంతెన దిగువన బోల్తా పడిన ఆటో

సఖినేటిపల్లి: మండలంలోని టేకిశెట్టిపాలెం, అప్పనరామునిలంక గ్రామాల మధ్య గోదావరి పాయపై కొత్తగా నిర్మించిన వంతెనకు సమీపంలో ప్రయాణీకులతో వెళుతున్న ఆటో ఒకటి బుధవారం బోల్తా పడింది. వంతెనకు అప్పనరామునిలంక వైపు నుంచి టేకిశెట్టిపాలెం ఏటిగట్టుకు వస్తున్న ఈ ఆటో వంతెన అప్రోచ్ రోడ్డు ఎక్కే క్రమంలో ప్రమాదవశాత్తూ బోల్తా కొట్టి రోడ్డు చేరి ఉన్న గోదావరి నీళ్లల్లోకి జారుకుంది. అటుగా వెళుతున్న వారు హుటాహుటిన ప్రయాణికులను ఒడ్డుకు చేర్చారు. దీంతో ప్రయాణికులు అందరూ సురక్షితంగా బయటపడ్డారు. అలాగే ఆటోను కూడా రోడ్డుపైకి చేర్చారు. కాగా ఎత్తుగా ఉన్న అప్రోచ్ రోడ్డు ఎక్కే క్రమంలో ఆటోకు చోటు చేసుకున్న ప్రమాదంపై వివరాలు తెలియాల్సి ఉంది.

## పెండ్యాల మృతికి ఎమ్మెల్సీ సంతాపం



మాజీ ఎమ్మెల్యే కృష్ణబాబు సంతాప సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

అమలాపురం టౌన్: కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నాయకుడు పెండ్యాల కృష్ణబాబు మృతికి ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు సంతాపం తెలిపారు. స్థానిక హైస్కూలు సెంటరులోని ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో బుధవారం జరిగిన సంతాప సభలో ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే కృష్ణబాబు నీతి నిజాయితీ, రాజకీయ విలువలతో పనిచేశారని కొనియాడారు. సినీ నిర్మాతగా, ఆంధ్ర సుగర్స్ అధినేతగా విధులు నిర్వహిస్తూనే, కొవ్వూరు నియోజకవర్గం నుంచి ఐదు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై ప్రజలకు నిస్వార్థ సేవలు అందించారని గుర్తు చేశారు. వితరణ శీలిగా, ఎందరో కళాకారులను ప్రోత్సహించిన కృష్ణబాబు మృతికి సమావేశం రెండు నిమిషాలు మౌనం పాటించి, శ్రద్ధాంజలి ఘటించింది. సమావేశంలో వైఎస్సార్ సీపీ టీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, మున్సిపల్ కౌన్సిలర్ చిట్టూరి పెదబాబు, పార్టీ నాయకులు కుడుపూడి త్రినాథ్, ముంగర ప్రసాద్, యనమదల కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలకు యువత ప్రాధాన్యమివ్వాలి



క్రీడాకారులతో కరచాలనం చేస్తున్న అధికారులు

యానాం: యువత విద్యతో పాటు, క్రీడలకూ ప్రాధాన్యమివ్వాలని, తద్వారా జాతీయ, అంతర్జాతీయ టోర్నీల్లో దేశానికి ప్రాతినిధ్యం వహించే అవకాశం ఉంటుందని ఎస్పీ యు.రాజశేఖరన్ అన్నారు. బుధవారం యానాం డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోషియేషన్(వైడీసీఏ) ఆధ్వర్యంలో స్థానిక మెట్టకూరు ప్రభుత్వ హైస్కూల్ క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో జరిగే సీచమ్ క్రికెట్ ట్రోఫీ–2024 టోర్నీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల్లో ఉన్న క్రీడానైపుణ్యాలను వెలికితీసేందుకు ప్రాంతీయ స్థాయి టోర్నమెంట్‌లు ఎంతగానో దోహదపడతాయన్నారు. అంతకుముందు ఎస్పీ రాజశేఖరన్ తదితరులు క్రీడాకారులను కరచాలనం ఇచ్చి, టోర్నీలో రాణించాలని శుభాకాంక్షలు తెలియజేశారు. ఈనెల 22 నుంచి 31 వరకు జరిగే టోర్నీలో మొత్తం 20 మ్యాచ్‌లు జరుగనున్నాయి. ఈ టోర్నీలో మొత్తం 10 జట్లు పాల్గొంటుండగా, ఒక్కో జట్టు మొత్తం 4 మ్యాచ్‌లు ఆడనున్నాయి. జూన్ 1 సెమీఫైనల్స్, 2న ఫైనల్స్ జరగనున్నాయి. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు పి రమేష్, సెక్రటరీ కె సుబ్బారావు, జాయింట్ సెక్రటరీ చిట్టి, కె ప్రసాద్, పి ప్రసాద్, టోర్నీ ఆర్గనైజింగ్ కమిటీ పంతగడ సుమన్‌బాబు, సత్యం, కె జయచంద్ర, కె సత్యనారాయణ, పీఈటీలు పాలికి ప్రకాష్, చింతా వెంకన్న పాల్గొన్నారు.

### ఘనంగా మరిడమ్మ జాతర

ముమ్మిడివరం: ఠానేల్లంక శివారు మొల్లి గ్రామ దేవత మరిడమ్మ తల్లి జాతర మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రతి ఏటా మూడు రోజుల పాటు జాతర మహోత్సవాలు నిర్వహిస్తారు. ఆదివారం నుంచి జాతర మహోత్సవాలు ప్రారంభమయ్యాయి.

## కోనసీమకు రోడ్, బ్రిడ్జిల కనెక్టివిటీ పెంచాలి



వారణాశి రామ్‌మాధవ్‌కు వినతిపత్రం ఇస్తున్న సామాజికవేత్త బోనం రాజు

మలికిపురం: అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు రోడ్, బ్రిడ్జిల కనెక్టివిటీ పెంచాలని ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి రామ్‌మాధవ్‌కు కోనసీమ ప్రతినిధుల బృందం విజ్ఞప్తి చేసింది. కోనసీమ తీర ప్రాంతం సునామీ, తుపాను ప్రమాదాలతోనూ, గోదావరి వరదల ఉత్పాతంతోనూ, ఓఎన్జీసీ కార్యకలాపాల నిర్వహణా ప్రమాదాల వలన నిత్యం బతుకు భయంతో జీవిస్తున్న కోనసీమ ప్రజలను ఆదుకునేందుకు రోడ్ కనెక్టివిటీ, బ్రిడ్జ్ కనెక్టివిటీస్ పెంచి కోనసీమ ప్రజలను ఆదుకోవాలని వారణాసి రామ్ మాధవ్‌కు సామాజిక కార్యకర్త బోనం రాజు విజ్ఞప్తి చేశారు..మంగళవారం కాకినాడలో ప్రముఖ సంగీత వాగ్గేయకారుడు కొచ్చర్లకోట రామరాజు కీర్తనలను బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వర రావు చేతుల మీదుగా ఆవిష్కరించిన కార్యక్రమంలో పాల్గొన్న రామ్‌మాధవ్‌ను కలిసి ఈ మేరకు వినతి పత్రం అందించినట్లు బోనం రాజు బుధవారం మలికిపురంలో విలేకరులకు తెలిపారు. గతంలో కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి కోనసీమ రైలు మార్గం కోసం నిధులు విడుదల చేయించిన సంగతిని గుర్తు చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. గతంలో మంత్రి పినిపే విశ్వరూప్ సహకారంతో ఉభయగోదావరి జిల్లాల ఎంపీలు చింతా అనూరాధ, వంగా గీత, మార్గాని భరత్, పిల్లి సుభాష్ చంద్రబోస్, కె.రఘురామ కృష్ణంరాజు అభ్యర్థన పత్రాలతో కేంద్ర జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కరీకి అభ్యర్థన పత్రం పంపినట్లు కూడా ఆయన వివరించారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రావులపాలెం: మండలంలోని ఈతకోట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు అమలాపురం ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం. రవికుమార్ బుధవారం తెలిపారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఈతకోట సెక్షన్ పరిధిలోని గోపాలపురం, ఈతకోట, ముమ్మిడివరప్పాడు, లక్ష్మీపోలవరం, పొడగట్లపల్లి, మట్లపాడు, దేవరపల్లి, వేదిరేశ్వరం, కోసూరునగర్, గరువు, కేతరాజుపల్లి, చెల్లిరేవు ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

## వంతెన నిర్మాణంపై ఫిర్యాదు



మొగలికుదురులో పంట కాలువపై నిర్మిస్తున్న వంతెన

మామిడికుదురు: మొగలికుదురు గ్రామంలోని షిర్డీ సాయిబాబా ఆలయం వద్ద పంట కాలువపై వంతెన నిర్మాణం చేపట్టడంపై స్థానికులు అభ్యంతరం తెలిపారు. దీనిపై ఇరిగేషన్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. వంతెన నిర్మాణం వల్ల ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందని, వంతెన నిర్మాణాన్ని తక్షణం నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై ఇరిగేషన్ ఏఈ సుందర్‌సింగ్‌ను వివరణ కోరగా వంతెన నిర్మాణానికి గత ఏడాది అనుమతి ఇచ్చామన్నారు. స్థానికుల నుంచి ఏ విధమైన అభ్యంతరం లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత తమ పరిధిలోది కాదన్నారు. స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు వంతెన నిర్మాణాన్ని నిలుపుదల చేయించామని చెప్పారు.

## ఖరీఫ్ పంటకు కార్యాచరణ సిద్ధం

**జిల్లా వ్యవసాయ అధికారి ఓలేటి వెల్లడి**



ఆలమూరులో ఖరీఫ్ సాగుపై సూచనలు, సలహాలు అందజేస్తున్న డీఏఓ బోసుబాబు

ఆలమూరు: స్థానిక సబ్ డివిజన్ పరిధిలోని మూడు మండలాల్లోని రైతులు ఖరీఫ్ పంటకు సన్నద్ధం కావాలని జిల్లా వ్యవసాయ అధికారి ఓలేటి ఏసుబాబు కోరారు. ఆలమూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏడీఏ కె.నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో డీఏఓ బోసుబాబు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవడం వల్ల రబీ సాగు ఆశాజనకంగా ముగిసిందన్నారు. ఇప్పటికే ధాన్యం కొనుగోళ్లు పూర్తయినందున రైతులందరూ ఖరీఫ్ సాగుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో నెలకొల్పిన ఆర్బీకేల్లో అన్నదాతలకు అవసరమైన విత్తనాలను సిద్ధం చేశామన్నారు. అలాగే ఖరీఫ్ పంటకు అవసరమయ్యే ఎరువులను అందుబాటులో ఉంచామన్నారు. మండల స్థాయి అధికారులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఏడీఏ నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతులందరూ తప్పనిసరిగా విత్తనాలకు విత్తన శుద్ధి చేయాలన్నారు. ఖరీఫ్ సాగులో మేలైన దిగుబడులు సాధించేందుకు వీలుగా ప్రతి గ్రామంలోని వారం వారం పొలంబడి కార్యక్రమాలను నిర్వహించనున్నామన్నారు. దీనివల్ల క్షేత్రస్థాయిలో రైతులకు ఖరీఫ్ సాగులో తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన ఏర్పడుతుందని ఆయన పేర్కొన్నారు. జిల్లా వ్యవసాయ సాంకేతిక వ్యవసాయాధికారి మురళి, ఏఓలు ఎస్.లక్ష్మీ లావణ్య, యేసుబాబు, కెవీఎస్ రమేష్‌కుమార్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా ఇటికాలమ్మ జాతర

అంబాజీపేట: మాచవరంలో వేంచేసిన ఇటికాలమ్మ అమ్మవారి జాతరను బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. అమ్మవారి పూజఘటాలతో గ్రామోత్సవం నిర్వహించారు. జాతరలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఉత్సవ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు మైపాల నాగబాబు, బండారు కొండల ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. గురువారం ఆలయ ప్రాంగణం వద్ద తీర్థం నిర్వహిస్తారన్నారు.

### మలికిపురంలో సుదర్శన హోమం



హోమంలో పాల్గొన్న భక్తులు

మలికిపురం: స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ఘనంగా సుదర్శన హోమం జరిగింది. ఆలయ ధర్మకర్త ఉయ్యూరు హరిప్రసాద్ రాజు పాల్గొన్నారు. ఆలయ అర్చకుడు కిలాంబీ వెంకటాకృష్ణమాచర్యుల ఆధ్వర్యంలో జరిగిన హోమంలో వందలాది మంది భక్తులు పాల్గొని పూజలు చేశారు.

### 26న మహాలక్ష్మమ్మ జాతర

మామిడికుదురు: పెదపట్నంలంక గ్రామ దేవత శ్రీమహాలక్ష్మమ్మ జాతర మహోత్సవం ఈ నెల 26వ తేదీ ఆదివారం జరుగుతుందని ఆలయ కమిటీ బుధవారం తెలిపింది. అమ్మవారికి సోమవారం భక్తులు నైవేద్యాలు చెల్లిస్తారని, మంగళవారం సిరిబొమ్మ తీర్థం జరుగుతుందని ఆలయ కమిటీ పేర్కొంది. జాతర మహోత్సవాల సందర్భంగా ఆలయం వద్ద భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. పందిళ్లు ఏర్పాటు చేసి విద్యుత్ దీపాల వెలుగులతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు.